ప్రజాశక్తి
శుక్రవారం 23 మే, 2025
5
శ్రీకాకుళం

## రహదారులకు మరమ్మతులు చేయాలి

**కొత్తూరు:** మండల కేంద్రంలో అలికాం-బత్తిలి, పాలకొండ రోడ్డు, వసప-నివగాం రోడ్లు పూర్తిగా గోతులమయమయ్యాయని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కొత్తూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా ధ్వంసమైన ప్రధాన రోడ్లను నిర్మిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఏడాది అవుతున్నా... ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదని పేర్కొన్నారు. కొత్తూరు-పారాపురం, వసప-నివగాం మధ్య మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని అధికారికంగా రెండు నెలల క్రితం ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని అన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా పాలకులు నిర్లక్ష్యం వీడి రోడ్లను మరమ్మతులు చేయాలని, లేకుంటే ప్రజా పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

## రావివలస అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు

### 'మన ఊరు - మాటా మంతి'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

వర్చువల్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

పాల్గొన్న రవివలస గ్రామస్తులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలస గ్రామ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. స్థానిక భవానీ సినిమా థియేటర్‌లో వర్చ్యువల్ ద్వారా మన ఊరు-మాటామంతి కార్యక్రమంలో భాగంగా ముఖాముఖి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వెండితెర ద్వారా ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని, అక్కడికక్కడే రూ.15 కోట్లుతో పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రావివలసను పరిశుభ్రంగా ఉంచుకొందామని పిలుపునిచ్చారు. సినిమా థియేటర్ సినిమాలు వినోదాలకే కాదు సామాజిక బాధ్యతను ఉపయోగపడటం సంతోషంగా ఉందన్నారు. మన ఊరు - మాటా మంతి ముఖ్య ఉద్దేశం ప్రభుత్వం నిధులు ఖర్చు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాదు.. ప్రజలందరికీ భాగస్వామ్యం, ఐక్యత చాలా అవసరమన్నారు. గ్రామ ఉమ్మడి ఆస్తులు కాపాడటంలోను, పాఠశాల ఆవరణలో ఆకతాయిలు చేసే పనులను ప్రజలంతా ఏకమై తిరిగి స్కూల్‌ను చూడాలంటేనే భయపడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లకు అలవాటు పడకుండా వారు ఆడుకొనేటట్లు ప్రభుత్వ ఖాళీ స్థలాలను బాగుచేసి ఆట స్థలాలుగా మారిస్తే వారు ఫిట్ నెస్ పెంచుకోవచ్చని చెప్పారు. ఆడబిడ్డలకు గ్రామ సమాజం రక్షణ కవచంలా నిలడాలన్నారు. పలువురు గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ విషయంపై మాట్లాడాలని ఉప ముఖ్యమంత్రి చెప్పగా కలెక్టర్ మాట్లాడారు. కాలువలు లేకుండా లే అవుట్లకు అనుమతులు ఇవ్వరాదని, రహదారి సింగిల్ లైన్‌లో ఉందని, దానిని డబుల్ రోడ్‌గా వేయొచ్చని, దీనిపై సర్వే చేస్తామని అన్నారు. ఈ రోడ్డు ఉపాధి హామీ కింద వేయొచ్చని, దీనికి రూ.3 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. బరియల్ గ్రౌండ్‌కు రహదారి ఉపాధి హామీ ద్వారా వేయొచ్చని చెప్పారు. గ్రామంలో అంతర్గత రహదారులు, కాలువలు వేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. కిచెన్ గార్డెన్స్ వద్ద మొక్కలు నాటితే బాగుంటుందని, కాలువలు నిర్మించకపోతే కాలువల నీరు రోడ్లపైకి వస్తుందని అన్నారు. సామూహిక ఇంకుడు గుంతలు నిర్మిస్తే వర్షం నీరు నేరుగా ఇంకుడు గుంతల్లోకి చేరుతుందని చెప్పారు. 25 ఇంకుడు గుంతలు గ్రామానికి మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జల్‌జీవన్ మిషన్ నీరు వచ్చే వరకు పైపులైన్లు, ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. సామాజిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వినూత్నమైన కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. వినూత్న కార్యక్రమంలో భాగస్వామ్యలైన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్‌ను ఉపయోగించుకొని దాదాపు 15, 20 పనులను అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి గ్రామానికి అవసరమైన పనులు గ్రామస్తులే నిర్వహించుకొనే వీలుకల్పించినట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ రావివలస పంచాయతీ గురించి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ రవిబాబు, ఎంపిడిఒ లక్ష్మీబాయ్ పాల్గొన్నారు.

### కార్యకర్తలతోనే మాటామంతి

ప్రత్యేకంగా ఎంపిక చేసిన రావివలస ప్రజలకు మా ఊరు-మాటామంతి కార్యక్రమం భాగంగా నేరుగా డిప్యూటీ సిఎం మాట్లాడారు. పంచాయతీలో సమస్యలు, అభివృద్ధిపై తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రావివలస పంచాయతీ ప్రజలు మాట్లాడకుండా కేవలం కూటమి కార్యకర్తలనే స్థానిక భవాని థియేటర్‌లోకి అధికారులు తప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. మాటామంతి కార్యక్రమం విషయం తెలుసుకున్న రావివలస ప్రజలు పాసులు పట్టుకుని థియేటర్ వద్దకు వేలల్లో చేరుకున్నారు. థియేటర్ హౌస్‌ఫుల్ అపోయిందని పోలీసులు షాక్ చూపించి మిగతా వారికి అనుమతులు ఇవ్వలేదు. ఏమని ప్రజల ప్రశ్నిస్తే కలెక్టర్ అనుమతి నిరాకరించారని పోలీసులు తెలిపారు. సమస్య చెప్పుకోవడానికి వచ్చామని, పాస్ ఇచ్చి కూడా అనుమతి ఇవ్వకపోతే కార్యక్రమం ఎందుకని గ్రామానికి చెందిన కుప్పిలి సరస్వతి ప్రశ్నిస్తుంది.



థియేటర్ బయట వేచి ఉన్న గ్రామస్తులు

## టిడిపిలో 'మహా' అసంతృప్తి

- నేతల నోట కార్యకర్తల ఆవేదన
- పదవుల కోసం ఓపిక పట్టాలి
- టిడిపి జోనల్ ఇన్‌ఛార్జి పి.శ్రీనివాసులు రెడ్డి
- కార్యకర్తల బాధలను తీర్చే పరిస్థితి లేదు : శివాజీ

మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపిలో అంతర్గతంగా గూడుకట్టుకుని ఉన్న అసంతృప్తిని పలువురు ఎమ్మెల్యేలు, నేతలు టిడిపి మినీ మహానాడు సాక్షిగా వెలిబుచ్చారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక 80 అడుగుల రోడ్డులో ఉన్న టిడిపి జిల్లా పార్టీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ మినీ మహానాడులో టిడిపి అధ్యక్షుడితో సహ పలువురు ఎమ్మెల్యేలు కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న వారిని కాకుండా 23 సీట్లు వచ్చినప్పుడు పార్టీ అంటిపెట్టుకున్న వారి వెంట ఉండాలన్నారు. నిజమైన కార్యకర్తలను వదులుకుంటే పార్టీకి ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరిక చేశారు. నామినేటెడ్ పదవుల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

తొలుత అధ్యక్ష ఉపాన్యాసం చేసిన టిడిపి అధ్యక్షుడు కలమట వెంకటరమణ మాట్లాడుతూ 2019-24 కాలంలో పని చేసిన కార్యకర్తలకు నామిటేడెట్ పదవులు ఇవ్వాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం బనాయించిన తప్పుడు కేసులను ఎత్తేయలన్నారు. నిజమైన కార్యకర్తలను వదులుకోకూడదని హితవుపలికారు. పార్టీకి 23 సీట్లు వచ్చినప్పుడు జెండాలు మోసిన నిజమైన కార్యకర్తలను గుర్తుంచుకోవాల్సిన అవసరముందన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ పదవులు రాలేదని నిరుత్సాహ పడొద్దన్నారు. పదవులు వెంటనే రావని, తనకు పదవి రావడానికి 30 ఏళ్ల పట్టిందని చెప్పారు. అసంతృప్తితో ఉన్నవారికి నచ్చ చెప్పాలని అన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ గత వైసిపి సైకో ప్రభుత్వాన్ని ఎదిరించి టిడిపిని నిలబెట్టిన వారికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. పదవులు రాలేదని అసంతృప్తితో ఉన్నారని తమకు తెలుసుని, ఎవరూ నిరాశ చెందొద్దన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సాధారణ కార్యకర్తలకు సైతం టిడిపి గౌరవించి గుర్తిసుందనటానికి తాను ఒక ఉదాహరణ అని అన్నారు.

**పదవుల కోసం ఓపిక పట్టాలి: శ్రీనివాసులు రెడ్డి**

పదవులు రాలేదని ఎవరూ నిరాశ చెందొద్దని టిడిపి జోనల్ ఇన్‌ఛార్జి పి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కటిగా పదవులను భర్తీ చేస్తోందని, అంత ఓపిక పట్టాలని ఆయన సూచించారు. రాష్ట్రానికి, జిల్లాకు నిధులు తీసుకురావడంలో అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఉద్భోధించారు.

**కార్యకర్తల బాధలను వినే పరిస్థితి లేదు : శివాజీ**

కార్యకర్తలకు అనేక ఇబ్బందులు, బాధలు ఉన్నాయని వాటిని వినే పరిస్థితి లేదని టిడిపి సీనియర్ నాయకులు మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీ అన్నారు. గత వైసిపి ప్రభుత్వ వేధింపులకు అర్ధబలం, అంగబలం ఉన్నవారు తట్టుకున్నారని, మిగిలిన వాళ్లను పార్టీయే ఓదార్చాలని అన్నారు. ప్రతినెలా జిల్లాస్థాయి సమావేశం నిర్వహించాలన్నారు.

అందరమూ సీనియర్లు కావడంతో ఎవరూ మాట వినడం లేదన్నారు. చంద్రబాబు, లోకేష్ చెప్తేనే వింటారని ఆ బాధ్యత తీసుకోవాలంటూ శ్రీనివాసులు రెడ్డిని ఉద్దేశించి అన్నారు. పథకాలపై ప్రతిస్పందన తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, అదే సమయంలో కార్యకర్తలతో నేరుగా మాట్లాడే ప్రయత్నం చేయాలని అన్నారు. జిల్లాలో పార్టీని, కార్యకర్తలను ఉత్తేజపర్చాల్సిన బాధ్యత అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడుపై ఉందన్నారు.

**పనితీరు ఆధారంగానే పదవులు**

టిడిపికి పని చేసిన వారి చరిత్ర చంద్రబాబు, లోకేష్ వద్ద ఉన్నాయని, వాటి ఆధారంగానే పదవులు వస్తాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఒక రోజు ఆలస్యమైనా కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. రాబోవు రోజుల్లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తామన్నారు. వారి ఇబ్బందులను తెలుసుకోవడానికి ప్రతినెలా ఒక కార్యక్రమం రూపొందిస్తామని చెప్పారు. కార్యకర్తల కష్టంతో పార్టీ అధికారంలోకి వచ్చిందని, లక్ష్యాన్ని చేరుకున్నామని ఎవరూ నిరాశ చెందొద్దని అన్నారు. తమకు ఉద్యోగాలు కావాలని నాయకులు వస్తున్నారని, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తే అందరికీ ఉద్యోగాలు వస్తాయని భరోసా ఇచ్చారు. జిల్లాలో రూ.30 వేల కోట్లతో టైటానియం ప్రాజెక్టు ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామని, వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తితో పాటు ఎయిర్‌పోర్టు, పోర్టు పూర్తి చేసి వలసలను నివారిస్తామని చెప్పారు.

**ఎమ్మెల్యే కూన రవి దూషణల పర్వం**

చెరుకు పండించే రైతే లేకపోతే సుగర్ ఫ్యాక్టరీ తెరవాలంటూ కొంత మంది అడుగుతున్నారంటూ దూషణ పర్వానికి దిగారు. సుగర్ ఫ్యాక్టరీ స్థలం విలువ రూ.1035 కోట్లు ఉండటంతో పారిశ్రామిక వేత్తలను సంప్రదిస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. అదానీని సంప్రదించి డేటా సెంటర్‌ను పెట్టించగలిగితే ప్రోత్సాహకాలు అందించడంతో తక్కువ రేటుకు భూమి ఇచ్చే అవకాశాలు పరిశీలించాల్సిన అవసరముందన్నారు.

**కమ్యూనిస్టులను చూసి నేర్చుకోవాలి**

సభలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రసంగిస్తున్న సమయంలో అకస్మాత్తుగా వర్షం కురిసింది. ఆయన ప్రసంగం మధ్యలోనే అంతా పరుగులు తీస్తుండటంతో ఎందుకలా వెళ్లిపోతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను చూసి నేర్చుకోవాలని, వీళ్లందరికీ ట్రైనింగ్ ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు.

**మహానాడులో పలు తీర్మానాలు**

వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, మహిళా సాధికారత, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల సంక్షేమం, జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు తదితర అంశాలపై మహానాడులో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పర్యటకులు, ఆపరేషన్ సింధూర్‌లో అశువులు బాసిన జవానులు, మరణించిన టిడిపి నేతలు, కార్యకర్తలకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు విఠల్‌రావు, అరవల రవీంద్ర, చౌదరి నారాయణమూర్తి, ఆనెపు రామకృష్ణ నాయుడు, పీరుకట్ల విశ్వప్రసాద్, మాదారపు వెంకటేష్, పైడిశెట్టి జయంతి, చింతు సుధాకర్, పిఎంజె బాబు, పాలిశెట్టి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన తూనికల కొలతల అధికారి

### రూ.1.78 లక్షలతో పట్టుబడిన వైనం

ఎసిబికి పట్టుబడిన శ్రీధర్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ తూనికలు కొలతల అధికారిగా పనిచేస్తున్న వి.శ్రీధర్ చిరు వ్యాపారుల నుంచి రూ. 1.78 లక్షలు డబ్బులు తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళ్తే కాశీబుగ్గ తూనికలు కొలతల అధికారిగా బి.శ్రీధర్ పనిచేస్తున్నారు. ఈయన కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో పాతపట్నం, నరసన్నపేట నుంచి ఇటు ఇచ్ఛాపురం వరకూ ఉన్న మండలాలు ఉన్నాయి. వేలాది మంది వ్యాపారులు ఇక్కడి కార్యాలయం పరిధిలోకి వస్తారు. వారి వద్ద ఉన్న విద్యుత్ కాటాలకు ఏటా కొత్తగా సీళ్లు వేసి వ్యాపారాలు చేయాల్సి ఉంది. దీనికోసం ప్రభుత్వం రూ.300 ఒక్కో కాటాకు రుసుం వసూళ్లు చేస్తుంది. దీనికి కాశీబుగ్గ తూనికల కొలతలశాఖ అధికారులు సీళ్లు వేసి వారికి నిరభ్యంతర పత్రాలు ఇవ్వాల్సి ఉంది. అయితే స్థానిక తూనికల కొలతల అధికారి శ్రీధర్ మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన ధరతో పాటు అదనంగా ఒక్కో కాటాకు రూ.400 డిమాండ్ చేశారు. దీంతో పాటుగా ఆయనకు కాటాల అనుమతి పత్రాలు ఏడాదిన్నరగా తిప్పుతూ వారికి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై ప్రశ్నించినా సమాధానం ఇవ్వకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వారిపై వ్యవహరించారు. ఎన్ని మార్లు ఆయనను నిలదీసినా దిక్కున్నచోటు చెప్పుకోవాలని, వారిపై చులకనగా చూడడంతో ఆయనపై ఎసిబి అధికారులకు నేరుగా ఫిర్యాదు చేశారు. మొత్తం తూకాల సీళ్లన్నీ స్థానికంగా ఉన్న వాటిని రిపేర్లు చేసే సిబ్బంది చూస్తుంటారు. వారి ద్వారా నగదును అదనంగా సేకరించినట్లు ఆయనపై అభియోగాలు ఉన్నాయి. మొత్తం డివిజన్ పరిధిలో గతంలో 265, ప్రస్తుతం 179 మంది వ్యాపారుల వద్ద రూ.1.78 లక్షలు వసూళ్లు చేయగా, ఎసిబి అధికారులు శ్రీధర్ కార్యాలయంపై దాడి చేసి మొత్తం నగదు రెడ్‌హేండెండ్‌గా పట్టుకున్నారు. ఎసిబి నిబంధనల ప్రకారం చేయాల్సిన వ్యవహారానంతా నిర్వహించి ఆయనతో పాటు బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకొన్నారు. నగదుతో పట్టుబడిన తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీధర్‌ను విశాఖపట్నం ఎసిబి కోర్టులో శుక్రవారం హాజరుపరుస్తున్నట్లు డిఎస్‌పి రమణమూర్తి తెలిపారు. దాడుల్లో సిఐ భాస్కరరావు సిబ్బంది ఉన్నారు. అనంతరం ఎసిబి డిఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ అవినీతికి ఎవరు పాల్పడినా కఠినంగా శిక్షకు గురికాక తప్పదని హెచ్చరించారు. చిన్న వ్యాపారుల నుంచీ అదనంగా ఒక్కో తూకం యంత్రానికి రూ.400 వసూళ్లు చేయడం దారుణమన్నారు. దీంతో పాటుగా ఉద్దేశపూర్వకంగా సంబంధిత కాటాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, గత ఏడాది అక్టోబరు నెల నుంచి పెండింగ్‌లో ఉంచారన్నారు. మొత్తం 445 మంది కాటాలకు చెందిన డబ్బులు ఏకమొత్తంలో తీసుకుంటుండగా శ్రీధర్‌ను పట్టుకున్నామని తెలిపారు. దీంతో పాటుగా ఇంకా ఏమైనా నేరాలకు పాల్పడిందో లేదో సూక్ష్మ పరిశీలన చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా అవినీతికి పాల్పడిన వారిపై ఫిర్యాదులు ఇస్తే వారి పేర్లు బయటకు చెప్పకుండా దాడులు చేసి అవినీతి పరుల ఆట కట్టిస్తామని స్పష్టం చేశారు.

## గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తం

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గర్భిణులు అధిక రక్తపోటు సమస్యలు తీవ్ర పరిణామాలకు దారి తీసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్‌కర్ అన్నారు. మే నెలను 'గర్భధారణలో రక్తపోటు వికృతుల నెల'గా మే 22న 'ప్రీ-ఎక్లాంప్సియా దినోత్సవం'గా ప్రభుత్వం ప్రకటించడంతో, జిల్లా కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణుల ఆరోగ్యాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని, తల్లి-శిశు సంరక్షణ విషయంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. పరిధిలోని గర్భిణులను ముందుగానే గుర్తించి, రక్తహీనత, గర్భధారణ డయాబెటిస్, సిఫిలిస్, కాలాయెమారు, హెమోగ్లోబిన్ స్థాయి, ఎచ్ఐవీ, క్షయరోగం వంటి అన్ని పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, హైరిస్క్ గర్భిణులను గుర్తించి, గత గర్భధారణలో రక్తపోటు సమస్యలు ఉన్నవారు, అధిక బరువు కలవారు, మధుమేహం ఉన్నవారు, కుటుంబంలో రక్తపోటు చరిత్ర ఉన్నవారు, 20 ఏళ్లలోపు, 35 ఏళ్లకు పైబడినవారు వంటి వారు ప్రత్యేక పర్యవేక్షణకు లోనవ్వాలని సూచించారు. తీవ్ర తలనొప్పి, చూపు మార్పులు, పొత్తికడుపు నొప్పి, మూత్ర విసర్జన తగ్గడం వంటి ఎక్లాంప్సియా సంకేతాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తగిన పోషణ, విశ్రాంతి, ప్రసవ ప్రణాళికపై కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. రక్తపోటుతో పాటు మూత్రంలో ప్రోటీన్ వచ్చినప్పుడు ప్రీ-ఎక్లాంప్సియా, మూర్ఛలు కూడా రావడం ఎక్లాంప్సియా లక్షణమని వివరించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సమస్యలకు అవసరమైన చికిత్సా సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డిఎంహెచ్ఎఒ డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ ప్రతి గర్భిణీ సమయంలో బిపి ఉంటే తక్షణమే నిపుణులచే సలహా పొందడం అవసరమని అన్నారు. గ్రామస్థాయిలో ఎఎన్ఎం, ఆశాలు గృహ సందర్శనలో భాగంగా గర్భిణులను, బాలింతలను సందర్శించి తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. గర్భిణులు ప్రతినెలా 9న నిర్వహిస్తున్న పిఎంఎస్ఎంఎ కార్యక్రమానికి హాజరయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించింది. జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామాస్, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పి.మోహిని, రత్నకుమారి పాల్గొన్నారు.

## లక్ష మొక్కల పెంపకమే లక్ష్యం

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాను హరిత జిల్లాగా మార్చేందుకు భారీ చర్యలు చేపట్టామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. లక్ష మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామని వెల్లడించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. మొక్కలు పెంచేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని అటవీ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చెరువుల గట్లు, కాలువల పక్కన మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సిఎస్ఆర్ నిధులను వినియోగించేలా చూడాలని తెలిపారు. ప్రజలూ భారీగా భాగస్వామ్యం కావాలని కోరారు. మొక్కల రక్షణ అత్యవసరం అని, ఓపెన్ ప్రదేశాల్లో రక్షణ ఉండదని, క్లోజ్డ్ కాంపౌండ్, హాస్పిటల్ లాంటి ప్రదేశాల్లో నాటితే మెరుగైన ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఫెన్సింగ్ తప్పనిసరిగా సిమెంట్, కాంక్రీట్ లేదా ఇటుకలతో ఉండాలని, లేకపోతే మొక్కలు నశించిపోతాయని హెచ్చరించారు. ప్రతి విభాగం తన పేరుతో మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి, స్థానికులను వాటి సంరక్షణకు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యంతో చేపట్టి జిల్లాను పచ్చదనంతో నిండేలా చేయాలని పిలుపునిచ్చారు.

## సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

### అధ్యక్షునిగా రవికుమార్, కార్యదర్శిగా శ్రీనివాసరావు

ఎన్నికైన అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని క్రిస్టల్ ప్యాలెస్‌లో పిఇటిపిడి అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షులు ఎం.వి.రమణ అధ్యక్షతన గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌ను దేశంలో నంబరు ఒన్ స్థానంలో నిలబెడతానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు క్రీడలపై ఆసక్తి, అవగాహన ఉందన్నారు. అందుకే అమరావతిలో పది వేల ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. దాంతోపాటు లక్షా 20 వేల సామర్థ్యంతో స్టేడియం కూడా నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటాని మూడు శాతానికి పెంచినట్టు తెలిపారు. త్వరలో ఆమదాలవలస స్టేడియంను సాఫ్ట్ బాల్ స్టేడియంగా రూపొందిస్తానన్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడా సామగ్రి సమకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామని, క్రీడను అభివృద్ధి చేయాలని పిఇటి, పిడిలను కోరారు. అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యక్రమాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా కలిదిండి నరసింహారాజు, కోశాధికారిగా జి.వి.సత్యనారాయణ, కన్వీనర్ బడగల హరినాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.వి.రమణ, ఉపాధ్యక్షునిగా ఎం.తిరుపతిరావు, బి.సురేష్, సహకారదర్శులుగా ఎ.ఢిల్లేశ్వరరావు, ఎం.ఆనంద్‌కిరణ్, కార్యవర్గ సభ్యులుగా పి.బాబూరావు, ఎస్.వి.రమణ, డి.పెంటయ్య, ఎస్.రామరాజు, కె.వరలక్ష్మి, జి. దుర్గాప్రశాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర పరిశీలకులుగా నరసింహారెడ్డి, రాష్ట్ర ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధిగా సుందరరావు, న్యాయ పరిశీలకులుగా కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, జిల్లా పార్ట్ టైంపార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది పనితీరుపై సమీక్ష

సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల సిబ్బంది పనితీరుపై జెడ్‌పిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం సమీక్షించారు. రెవెన్యూ విభాగంలో డిమాండ్-కలెక్షన్-బ్యాలెన్స్ ప్రకారం నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యుపిఐ కోడ్‌ల ద్వారా వసూళ్లను పెంచాలని, మున్సిపల్ ఆస్తులైన షాపులు, అద్దెలపై కఠినంగా వసూళ్లు చేపట్టాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో సానిటేషన్ కార్మికుల హాజరు నియమితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్ల డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. కమ్యూనిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పూర్తిగా ఆపరేషన్‌లోకి తేవాలన్నారు. మున్సిపల్ వాహనాల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ల ప్రగతిపై సమీక్షించారు. జిందాల్ ప్లాంట్‌కు వ్యర్థాల రవాణాపై స్పష్టత కోరారు. మరుగుదొడ్ల నిర్వహణ, కొత్తగా నిర్మించే మరుగుదొడ్లపైన కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. ఇంజినీరింగ్‌శాఖ పరిధిలో మంజూరైన గ్రాంట్లు, జనరల్ ఫండ్ పనుల పురోగతిపై సమీక్షించారు. పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో నిర్మాణాలు, కూల్చివేతల వ్యర్థాల నిర్వహణపై దృష్టిపెట్టాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీల జాబ్ చార్ట్‌ను పాటించేలా చూడాలని ఆదేశించారు. ఈ విభాగంలోనూ ఆదాయాన్ని పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, ఆయా వార్డు సచివాలయాల అడ్మిన్లు, వల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగా దినోత్సవం విజయవంతానికి కార్యాచరణ

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానురని, ఈ నేపథ్యంలో నెల రోజుల పాటు గ్రామస్థాయి వరకు యోగా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో యోగాపై అవగాహన పెంచే ఉద్దేశంతో ప్రతి మండలానికీ ఓ మాస్టర్ ట్రైనర్‌ను నియమించాలని సూచించారు. వీరు ఆయా మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు యోగా వినియోగాన్ని వివరించాలన్నారు. మండల స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, ఈ కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యత అప్పగించాలన్నారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలతో పాటు ఇతర ప్రముఖ ప్రాంతాల్లో రోజువారీగా యోగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల్లో చైతన్యం కలిగించేలా పోస్టర్లు, ప్రకటనల ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేకతతో యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులతో ఒకరోజు ప్రత్యేకంగా యోగా శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు.

**IN THE HONOURABLE COURT OF THE IVTH ADDITIONAL DISTRICT JUDGE CUM SC & ST (POA) ACT CUM MACT AT SRIKAKULAM**
**M.V.O.P. 257/2023**

Between:-
**Komanapalli Viswanadham** ....Petitioner
And:-
**Suravarapu Balakrishna** .....Respondent

To,
**Suravarapu Balakrishna,** S/o Nookalu, aged 33 years, Driver cum owner of the car bearing No. AP.10AK9156 residing at Kommusariapalli village, Saravakota mandal, Srikakulam district (Amended as per order in I.A.No.771/2024 dt;22.1.2025) Residing at E.No. 209, street No.12, Swarnapuri apartments, Hyderabad 500029.

**NOTICE**

It is to inform you that the above matter stands posted to on 27-05-2025 for your appearance .Hence you have to appear before the Honourable court on **27-05-2025 at about 10.30 AM**. as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.

**// By order of the Honourable court//**

**Y. V. RAMANAMURTHY**
**ADVOCATE, SRIKAKULAM.**

**SALE NOTICE**
**UNDER ORDER-21, RULE-64 C. P. C)**
**IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT-JUDGE (FAMILY COURT) AT SRIKAKULAM**
**E. P. 81/2024 in O. S. 49/2021**

Between :-
**(1) Bankupalli Venkata Jagadeesh Sarma,**
**(2) Yarlanki Kishore Kumar.**
.....Decree Holders / Plaintiffs
And :-
**Ingulige. Venkata Syam Kumar.**
......Judgment Debtor/ Defendant

To,
**Ingulige Venkata Syam Kumar,** S/o. Gopala Rao, Narasingurayudu Peta (Village), Lukalam (Post), Narasannapeta Mandalam, Srikakulam District.

పై నంబరు అమలు పిటిషనులో డిక్రీ హొల్డర్లు, మీ యొక్క అమలు పిటిషను షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని వేలాం వేయుట మూలంగా డిక్రీ పైకం రాబెట్టకోరి పై అమలు పిటిషన్ను పై కోర్టులో దాఖలు చేయగా, సదరు అమలు పిటిషను మీకు నోటీసు నిమిత్తం **తే 02-07-2025 దీకి వాయిదా అయి వున్నది.** కావున **తే. 02-07-2025 దీని పగలు 10-30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కోవలెను. లేనియెడల మీ పరోక్ష మందు తీర్మానించడమగునని యిందుమూలంగా తెలియ పరచడమైనది.

**సూధా సూర్యారావు**
**కరణం అప్పలనాయుడు**
**డిక్రీహొల్డర్లు తరపు న్యాయవాదులు,**
**శ్రీకాకుళం.**

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## మినీ జెట్టీతో వెలుగులు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్**

మినీ జెట్టీ ఏర్పాటు కావడంతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు సాధ్యపడతాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం పెదగనగల్లవానిపేట మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఇది మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దీనిని మత్స్యకారులంతా స్వాగతించాలని అన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో స్వయంగా మాట్లాడి వారికి జెట్టీ వలన కలిగే లాభాలను ఎమ్మెల్యే వివరించారు. మినీ జెట్టీ వలన మత్స్యకారులు వేటకు వెళ్లేటప్పుడు చేపలను ఒక ప్రదేశంలో ఉంచేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలలు తాకిడి వలన బోట్లు బోల్తాపడి చాలామంది మత్స్యకారులు మృతి చెందుతున్నారని, అటువంటివి జరగకుండా జెట్టీలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. మినీ జెట్టీ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మత్స్యకారులు హామీఇచ్చారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ మూకళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

## సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

**పోలాకి:** మండలంలో కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం పలువురు లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. పోలాకి మండలం కుసుమపోలవలస పంచాయతీ చల్లబంద నిమ్మాడ శైలజ అనారోగ్యంతో కారణంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 3,69,246 చెక్కును అందించారు. కొత్తరేవు పంచాయతీ సొండిపేట సేనాపతి ప్రభావతి మూకాళ్ల చికిత్స కోసం సిఎం సహాయనిధి నుంచి రూ.60 వేలు చెక్కును అందించారు. జలుమూరు మండలం చల్లవానిపేట దుంగ రత్నాలు మూకాళ్ల చికిత్సకు సిఎం సహాయనిధి నుంచి రూ.1,25,000 చెక్కును అందించారు. జలుమూరు మండలం రావిపాడు పంచాయతీ తిలారుకు చెందిన పొట్నూరు అనంతరావు కిడ్నీ వ్యాధి సర్జరీ కోసం రూ.1,57,732, సారవకోట మండలం అలుదుకు గొల్లపల్లి నిహారిక అనారోగ్యంతో బాధపడుతున్న సిఎం సహాయనిధి నుంచి రూ.40 వేలు చెక్కును అందజేశారు.

ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

## విఆర్‌ఎ సంఘం అధ్యక్షునిగా కేశవరావు

**ప్రజాశక్తి- పోలాకి**

మండలంలో విఆర్‌ఎ సంఘం అధ్యక్షునిగా దుండంగి కేశవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఎ సంఘం నూతన కార్యవర్గం గురువారం ఎన్నిక నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యక్షునిగా బోనెల రమణ, కార్యదర్శిగా డొంకాన సాయికుమార్‌లను కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావు ఎన్నికైన ధ్రువపత్రాన్ని అందజేశారు. వీరికి సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్యాకాండ ఆపాలి

**ప్రజాశక్తి- పలాస**

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 26 మంది మావోయిస్టు సభ్యులు, ఆదివాసీలను హత్య చేశారని జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు పత్రి దానేసు ఒక ప్రకటనలో ఆరోపించారు. శాంతి చర్చలకు తాము సిద్ధం, ఆదివాసీలపై హత్యాకాండ ఆపాలని, ఆపరేషన్ కగార్ వెనక్కు తీసుకోండని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా హత్యాకాండను కొనసాగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. భూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ఇవి చట్టవిరుద్ధమైన చర్యలు

చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపురం జిల్లాలో జరిగిన నరహంతక చర్యలు ఖండిస్తు తక్షణమే మిలటరీ చర్యలను నిలిపివేయాలని, ఆపరేషన్ కగార్ చర్యలను సిపిఐఎంఎల్ లిబరేషన్ జాతీయ కార్యదర్శి దీపాంకరభట్టాచార్య ఒక ప్రకటనలో ఖండించారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు, ఇతర మావోయిస్తుటు, ఆదివాసీ ప్రజలను బిజాపూర్ జిల్లాలో చట్టవ్యతిరేకంగా హత్యలు చేశారని ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిజాన్ని అంతమొందిస్తామనే పేరుతో ఆదివాసీలను హతమార్చి కార్పొరేట్ లూటీకి పాల్పడుతోందని ఆరోపించారు. న్యాయాన్ని ప్రేమించే భారతీయు లందరూ ఈ నరమేధంపై న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు ఏకపక్షంగా కాల్పులు విరమణ ప్రకటించారని, వారిపై సైనిక కార్యకలాపాలు నిలిపివేయాలని ప్రభుత్వానికి విన్నవించారు.

## ప్రకృతి వ్యవసాయం మేలు

### జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ

**ప్రజాశక్తి- పాతపట్నం**

ప్రకృతి వ్యవసాయ రైతులకు మేలుచేకూరుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మండలస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. డిపిఎం కేడర్‌లో పనితీరు సొంత పొలాల వివరాలు, పిఎండిఎస్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మరింత దగ్గర చేయాలని సూచించారు. ప్రతి రైతూ నవధాన్యాల సాగు పద్ధతి పాటించాలన్నారు. ప్రతి క్యాడర్‌కూ కనీసం రూ.25 వేలు సంపాదించేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ఖరీఫ్ కాలానికి అవసరమైన వనరులు అన్ని ఎన్ పిఎం షాప్‌లో అందుబాటులో ఉండేలా చూడాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎంటి ఎల్.రాజు, ఎన్‌ఎఫ్ఎ ముసలయ్య, ఎంటి సంజీవరావు, మెంటర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత

- ఒత్తిడిలో సిబ్బంది
- సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు

జె.ఆర్.పురం పోలీసుస్టేషన్

**ప్రజాశక్తి- రణస్థలం**

శ్రీకాకుళం జిల్లా ముఖద్వారంలో ఉన్న జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తుంది. కొన్నేళ్లుగా సరిపడా సిబ్బంది లేక రణస్థలం మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లో చోటు చేసుకునే సమస్యలపై స్పందించే వారు కరువయ్యారు. జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ, ఐదుగురు ఎఎస్‌ఐలు, ఏడుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 16 మంది కానిస్టేబుళ్లకలిపి మొత్తం 29 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ 29 మంది సిబ్బందిలో జె.ఆర్.పురం సర్కిల్ కార్యాలయానికి నలుగురు అటాచ్‌గా ఉండగా, పైడి భీమవరం అవుట్ పోస్ట్‌లో ఒకరు, ఇసుక తనిఖీ కేంద్రంలో ఒకరు, హైవే అంబులెన్స్‌కి ఒకరు, కోర్టు డ్యూటీలో ఒకరు, ఫరీదుపేట పికిటింగ్‌కి ఇద్దరు, ట్రైనింగ్‌లో ఒకరు, కంచిలి పోలీసు స్టేషన్‌కి ఒకరు అటాచ్‌లో ఉన్నారు. సుమారు 12 మంది బయట డ్యూటీలో ఉంటే ఇలా అరకొర సిబ్బంది కారణంగా ఉన్నవారిపై పనిభారం పెరగడంతో పాటు వారిపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ పోలీసులకు సవాల్‌గా మారుతుంది. ముఖ్యంగా పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఏదో ఒక పరిశ్రమ వద్ద ధర్నాలు, రాస్తారోకోలు, ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఇటు ప్రముఖుల బందోబస్తుతో పాటు పెట్రోలింగ్ విధులు నిర్వహించాల్సి వస్తుంది. అలాగే సుమారు 15 కిలోమీటర్ల మేర 16వ నెంబర్ జాతీయ రహదారి, ఈ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. పోలీ సులు నూతన టెక్నాలజీని వాడుతూ దొంగతనాలను అరికడుతున్నారు. నేరాలను అదుపు చేస్తున్నారు. అయినా అక్కడక్కడా పాత కక్షలతో దాడులు ప్రతిదాడులు వంటి నేరాలు, ఆకతాయిల ఆగడాలు చోటు చేసుకుంటుండడంతో ప్రజలను ఈ ఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.

### స్టేషన్ పరిస్థితి ఇలా...

పోలీస్‌స్టేషన్ పరిధిలో 34 గ్రామ పంచాయతీలు, సుమారు 60 గ్రామాలున్నాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం లక్ష జనాభా దాటి ఉంటారు. స్టేషన్‌లో కనీస సిబ్బంది లేకపోవడంతో సమస్యల పరిష్కారం సైతం మందకోడిగా జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సరిపడా సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### కనిపించని గ్రామ పోలీస్

గతంలో ప్రతి గ్రామానికి ఓ పోలీస్ అధికారిని అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. దీంతో పల్లెల్లో ఎలాంటి చిన్న సమస్య వచ్చినా గ్రామాధికారులు పరిష్కరించే వారు. సిబ్బంది కొరతతో గ్రామ పోలీస్ అధికారులు లేకుండా పోయారు. ప్రతి చిన్న సమస్యకు ప్రజలు మండల కేంద్రంలోని స్టేషన్‌కు రాక తప్పడం లేదు. వచ్చినా సిబ్బంది కొరతతో సమస్య త్వరగా తీరే అవకాశం లేకుండా పోయింది. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీర్చాలని పోలీసులు అనేక సార్లు ప్రతిపాదనలు ఉన్నతాధికారుల ముందు పెట్టినా వారి ప్రతిపాదనలు మాత్రం ముందుకు సాగడం లేదు, దీంతో రణస్థలం మండలంలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి.

సందర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

## జామియా మసీదు సందర్శన

**ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్**

నగరంలో ఉన్న జామియా మసీదులో గురువారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం సందర్శించారు. ఇటీవల జామియా మసీదులో జరిగిన గంధపు చెట్ల దొంగతనాన్ని పరిశీలించారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, దేవుడు మాన్యాన్ని దొంగతనం చేసిన దొంగలను వెంటనే పట్టుకోవాలని డిఎస్‌పిని ఆదేశించారు. ప్రస్తుతం మసీదులో జరుగుతున్న పరిణామాలు, పరిస్థితులను ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి పాండ్రంగి శంకర్, నగర టిడిపి మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, టిడిపి మైనార్టీ నాయకులు ఎండి రఫీ, జాంగిర్ ముస్లిం మతపెద్దలు మీర్ అసదుల్లా, ఢిల్లీ ఇంజనీరింగ్ భాష, రవూఫ్ ఖాన్, ఆర్.టి.ఖాన్, షేక్ అహ్మద్ తాజ్, అలీ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

నారా లోకేష్ యువగళం పాదయాత్రలో క్రిస్టియన్ మైనార్టీలకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఒకేసారి ఏడు నెలల పాస్టర్ల గౌరవ వేతనం రూ.35 వేలు విడుదల చేసిన సిఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు శామ్యూల్ అరుణ్ కుమార్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రదర్ అసిర్ కుమార్, డాక్టర్ ప్రత్తిపాటి ప్రసాద్, టెక్కలి రామారావు, జాన్ పీటర్, తమ్మినేడిపేట ఇస్సాకు, ప్రేమ్ కుమార్ కృష్ణ, బోరును, అబ్రహాం హాయనీ బాబు, శోభన్, గిరిజన పాస్టర్ అసోసియేట్ అన్నపు ఆనంద్ పాల్ పాల్గొన్నారు.

## నియామకపత్రం అందజేత

**ఆమదాలవలస:** మండలంలోని నెల్లిపర్తి గ్రామంలోని అంగన్వాడీ కార్యకర్త శెట్టి పద్మకు సిడిపిఒ అనూరాధ నియామకపత్రం గురువారం అందజేశారు. గత వైసిపి ప్రభుత్వంలో 2022లో నెల్లిపర్తి-1 కేంద్రం అంగన్వాడీ కార్యకర్తగా పనిచేసిన శెట్టి పద్మను అప్పట్లో టిడిపికి ప్రచారం చేస్తుందని ఫిర్యాదు చేసి రాజుకీయ కక్షలతో తొలగించారు. ఆమె రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని అప్పట్లో ఆశ్రయించారు. ఇటీవల సరైన సాక్షాదారాలు చూపనందున ఉన్నత న్యాయస్థానం కేసును కొట్టివేసి ఆమెకు ఉద్యోగ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించింది. దీంతో అధికారులు తీర్పును అమలు చేస్తూ ఆమెకు నియామకపత్రాలు అందజేశారు.

## పేదలకు అన్నదానం

**పలాస:** మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకుడు గౌతు శ్యామసుందర శివాజి జన్మదిన వేడుకలు గురువారం నాయకులు నిర్వహించారు. స్థానిక పలాస సీతారామాలయంలో పేదలకు మధ్యాహ్నం అన్నదానం, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అలాగే ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి పెళ్లి రోజు వేడుకలను టిడిపి నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, జోగ మల్లి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు బ్రాహ్మణతర్లా

**పలాస:** రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలో మండలంలోని బ్రహ్మణతర్లా పాఠశాల ఎంపికైంది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకొని గురువారం నిర్వహించిన రాష్ట్ర జీవవైవిధ్య సదస్సు నిర్వహించారు. మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ సమన్వయకర్త కొయ్యల శ్రీనివాసరావు ఆధ్వర్యాన అంతర్జాలం ద్వారా 'ప్రకృతితో సమరస్యం స్థిరమైన అభివృద్ధి' అనే అంశంపైన చిత్రలేఖన పోటీలో పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పుచ్చ అక్షరకుమార్ రాష్ట్రప్రథమ స్థానం సాధించారు. ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, రాష్ట్ర జీవ వైవిధ్య మండలి చైర్మన్ ఎన్.విజయకుమార్, మెంబెర్ సెక్రటరీ పి.రామకృష్ణ నుంచి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు.

## ఎండియు ఆపరేటర్లను కొనసాగించాలి

**రణస్థలం:** ఇంటింటికి రేషన్ సరుకులు డోర్ డెలివరీ చేస్తున్న ఎండియు వాహనాల ఆపరేటర్ల కాల పరిమితి 2027 వరకు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం రణస్థలం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆపరేటర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై ఎండియు ఆపరేటర్స్ యూనియన్ జిల్లా సెక్రటరీ లెంక అప్పలనాయుడు మాట్లాడుతూ తమకు 2027 వరకు ఉన్న అగ్రిమెంట్ కాలపరిమితి వరకు విధుల్లో కొనసాగించాలన్నారు. అలా కాకుంటే ఇంకా మిగిలి ఉన్న 20 నెలల్లో కాంపోజిషన్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అగ్రిమెంట్ గడువు ముగియ కుండానే తమను అర్ధంతరంగా తొలగించడం బాధాకరమన్నారు. ఎండియు వాహనాలు రద్దు నిర్ణయంపై 18, 500 కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారికి ఉపాధి కల్పించాలని, గత రెండు సంవత్సరాల నాలుగు నెలలుగా అంగన్వాడీ, మిడ్‌డే మిల్స్ బకాయిలు వెంటనే రిలీజ్ చేయాలని, గత నెల తమ ఇన్సూరెన్స్ అమౌంట్ రూ.9 వేలు తమ వ్యక్తిగత ఖాతాలను కట్ చేయడం జరిగిందని, వెంటనే మా అమౌంట్ తమకు ఇప్పించాలన్నారు. 2027 జనవరి వరకు అగ్రిమెంట్ ఉన్న మా వెహికల్స్‌కు బ్యాంకు లావాదేవీలు ప్రభుత్వమే ఎన్‌ఒసి ఇప్పించాలని, విజయవాడ వరద బాధితులకు ఐదు జిల్లాల నుంచి 1200 వెహికల్స్ వాడడం జరిగిందని, వాటికి సంబంధించిన డబ్బులు వెంటనే రిలీజ్ చేయాలన్నారు. నిరసన అనంతరం ప్రతినిధివర్గం తహశీల్దార్ కార్యాలయంలో డిటి హేమసుందర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎండియు ఆపరేటర్లు చౌదరి శ్రీనివాసరావు, టొంపల సురేష్, మైలిపల్లి జగ్గులు, జగ్గురోతు బంగారు నాయుడు, బసవ రమణ, లండ బలరాం, నిద్రబంగి రమణారెడ్డి, కొంచాడ గౌరునాయుడు, పిల్ల రమేష్, మాంతి చంద్రరావు, కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎండియు ఆపరేటర్లు

రక్తదానం చేస్తున్న సిహెచ్‌ఒలు

## సిహెచ్‌ఒలు రక్తదానం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం**

వైద్య ఆరోగ్య శాఖలోని జాతీయ హెల్త్‌మిషన్ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తున్న ఉద్యోగులు బుధవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటు న్నామని తెలిపారు. దీనికి సంబంధించి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. నేను సైతం అంటూ జిల్లాలో తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, రోడ్డు ప్రమాదాలకు లోనైన వారికి, మహిళలకు, వృద్ధులకు రక్తం అవసరం గ్రహించి వారి ప్రాణాలను కాపాడాలని లక్ష్యంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో పది మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, ఎన్.ఉమాశంకర్, జగదీష్ తదితర రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. యూనియన్ ప్రెసిడెంట్ ఎం.ఉషారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ఇందుమతి, వైస్ ప్రెసిడెంట్ డి.శ్రావణి, సిహెచ్ జ్యోతి, ముఖ్య సలహాదారుడు రాజీవ్, సభ్యులు సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## జీవ వైవిధ్యంతో భవిష్యత్ మెరుగు

**ప్రజాశక్తి- ఇచ్ఛాపురం**

జీవ వైవిధ్యంతో భవిష్యత్ మెరుగుపడుతుందని జ్ఞాన భారతి పాఠశాల కార్యదర్శి జోహార్ ఖాన్ అన్నారు. జ్ఞాన భారతి సీనియర్ సెకండరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలిచే విధంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వివిధ పక్షుల ఆవాసాల వద్ద జీవ వైవిధ్యాన్ని కాపాడాలని కోరుతూ నినాదాలను ప్రదర్శించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలని, జీవ వైవిధ్యాన్ని కాపాడడం భవిష్యత్‌ను కాపాడటమేనని అన్నారు. ప్రకృతిలోని అన్ని జీవరాశులను, ప్రకృతి ప్రసాదాలను, నదులను, నీటి వనరులను కాపాడుకోవడమే లక్ష్యంగా ప్రస్తుత తరం ఆలోచన విధానం ఉండాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం అందులో ప్రధానమని తెలిపారు. పాఠశాలలో వివిధ రకాల పక్షులు, కుందేళ్ళ, బాతులు, సునకాలు వంటి జీవరాశులకు ఆవాసం కల్పిస్తూ, పర్యావరణాన్ని, పచ్చదనాన్ని పెంచే విధంగా మొక్కలు నాటడం ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణ మూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యద్ సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జోహార్‌ఖాన్

## పిఎసిఎస్ స్థలానికి హద్దులు ఏర్పాటు

హద్దులను వేస్తున్న అధికారులు

**ప్రజాశక్తి- పొందూరు**

పోలీసుల భద్రత నడుమ రెవెన్యూ, సర్వే అధికారుల సహకారంతో పొందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్)కు సంబంధించిన స్థలంలో సరిహద్దు రాళ్లను గురువారం ఏర్పాటు చేశారు. మేజర్ పంచాయతీ పరిధిలో జోగన్నపేట వద్ద 408 సర్వే నంబరులో సొసైటీకి సంబంధించిన 26.5 సెంట్ల స్థలానికి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఇటీవల మండల పరిషత్ సాధారణ సమావేశంలో పిఎసిఎస్ స్థలం ఆక్రమణకు గురవుతుందంటూ మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. రవికుమార్ ఆదేశాలతో పిఎసిఎస్ సిఇఒ పాపినాయుడు తమ స్థలానికి హద్దులు నిర్ణయించాలని స్థలానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. హద్దుల ఆధారంగా తహశీల్దార్ ఆర్.వెంకటేష్ రామానుజులు, ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ గణపతి నిర్ధారించిన కొలతల ఆధారంగా సర్వేరాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సమయంలో జోగన్నపేటకు చెందిన కె.గోవింద ఈ స్థలం తమదంటూ వాదించడంతో మీవద్ద ఉన్న డాక్యుమెంట్లు సమర్పిస్తే విచారణ చేస్తామని తహశీల్దార్ ఆయనకు తెలిపారు. ఆ స్థలానికి సంబంధించిన సహేతుకమైన డాక్యుమెంట్లతో కార్యాలయానికి రావాలని ఆయనకు తహశీల్దార్ సూచించారు. హద్దుల ప్రాప్తికి సరిహద్దు రైతుల సమక్షంలో ప్రస్తుతానికి హద్దురాళ్ల ఏర్పాటు చేశారు.

## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**ఆమదాలవలస:** శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని బి.మల్లేష్ (79) వృద్ధుడు మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు శ్రీకాకుళం మండలం తండేవలసకు చెందిన మల్లేష్ బమ్మిడివానిపేట రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వృద్ధుడు అక్కడి కక్కడే మృతి చెందారని, ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మహిళపై దాడి

**ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు**

మండలంలోని అనంతగిరిలో హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన జనపాన రమణమ్మపై అదే గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు జనపాన సాంబమూర్తి, రాజేష్, ధనరాజ్ మూకుమ్మడిగా ఆమెపై గురువారం దాడి చేశారు. పక్కనే ఉన్న వంట పొయ్యిపై నెట్టి వేయడంతో ఆమె తీవ్రంగా గాయాల పాలయ్యింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను పలాస ప్రభుతాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రయివేటు ఆస్పత్రిలో బాధితురాలిని చేర్పించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బంగారం చోరీ

**పలాస:** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో ఉన్న తాళాను నాన్నారావు బంగారం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చోరికి పాల్పడి మూడు తులాల బంగారం చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాన్నారావు బంగారం దుకానికి మాస్కు, మంకి టోపీ ధరించిన యువకుడు బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చి బంగారం చూపించిమని చెప్పి బంగారం వస్తువులు కొనుగోలు చేసే నేపథ్యంలో మూడు తులాల బంగారం తస్కరించి షాపు నుంచి ఒక్కసారిగా పరారీ అయ్యాడు. సిసి కెమెరాలు పరిశీలించగా మేధరివీధి మీదుగా పాత జాతీయ రహదారి మీదుగా వెళ్ళిపోయాడు. బంగారం దుకాణం యాజమాని ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న సతీష్

## 'ఎఐ'తోనే భవిష్యత్

**నరసన్నపేట:** ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఎంచుకునే మార్గంతోనే వారి భవిష్యత్ ఆధారపడి ఉంటుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ మాకేన సతీష్ పేర్కొన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ఇంటర్ తర్వాత విద్యావకాశాలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలి జన్స్ (ఎఐ)లో డిగ్రీని పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఇప్పుడు ఈ డిగ్రీ ఇంజినీ రింగ్, సాధారణ డిగ్రీలోనూ అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే డ్యూయల్ డిగ్రీతో కూడా విద్యా ర్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ లో ఒక డిగ్రీ చేస్తూనే ఆఫ్‌లైన్‌లో మరొక డిగ్రీ పట్టా సాధించవచ్చన్నారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్. దుర్గా ప్రసాద్, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**శ్రీకాకుళం రూరల్:** పిడుగుపాటుతో బుచ్చిపేటకు చెందిన టిడిపి కార్యకర్త గేదల రాజారావు మృతి చెందడంతో నాయకులు ఆర్థిక సాయమందించారు. మంగళవారం పిడుగుపడడంతో రాజారావు మృతి చెందగా, కుమారుడు నాగార్జున తీవ్ర గాయాల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ రూ.50 వేలు ఆ కుటుంబ సభ్యులకు గురు వారం అందజేశారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు నాయకత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి గిరిజాశంకర్ పాల్గొన్నారు.

## ఉచిత విద్యకు అవకాశం

**రణస్థలం రూరల్:** మండల కేంద్రంలోని రామతీర్థాలు రోడ్డులో ఉన్న ఐరిస్ స్కూల్‌లో ఐఫీ (ఇన్స్పైర్ ఫ్రీ ఎడ్యుకేషనల్ ఎగ్జామినేషన్) ఉచిత విద్య, స్కాలర్ షిప్ ప్రోగ్రాం పోటీ పరీక్ష జూన్ 1న నిర్వహిస్తున్నట్లు ఐరిస్ సాకల్య స్కూల్ డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి ప్రతిభా పరీక్ష జూన్ 1న జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులం దరు వినియోగించుకోవాలని కోరారు. 5,6,7, 8 తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులు ఐరిస్ సాకల్య స్కూల్ వద్ద అప్లికేషన్‌ను నింపి ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని జతచేసి ఈ నెల 25లోగా నమోదు చేసుకోవాలన్నారు. సెలక్టయిన విద్యార్థులకు 10వ తరగతి వరకు విద్య, పుస్తకాలు, యూనిఫాంతో పాటు రవాణా సౌకర్యం పూర్తి ఉచితంగా కల్పించడం జరుగు తుందన్నారు. అలాగే స్కాలర్‌కు ఎంపికైన విద్యార్థులకు పదో తరగతి వరకు ప్రతిఏడాది రూ.5 వేలు స్కాలర్ అందజేస్తామని, మరిన్ని వివరాలకు 8885550389, 7989213779 నంబర్లను సంప్రదించాలన్నారు.

## రోడ్డుకు మోక్షమెప్పుడో?

**ప్రజాశక్తి- పాతపట్నం**

మండలంలోని తెంబూరు రైల్వేస్టేషన్ నుంచి బడ్డుమర్రి మీదుగా మెళియాపుట్టికి వెళ్లే రహదారి అధ్వాన స్థితిలో ఉంది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే భయపడుతున్నామని ఆయా గ్రామస్తులు, రైతులు, మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ రోడ్డుకు మోక్షం కలగడం లేదని వాపోతున్నారు. రహదారి మొత్తం గోతులతో, రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగిపోయి ప్రమాదాలు జరిగే విధంగా తయారైంది. వర్షం పడితే గోతుల్లో నీరు నిండుకుపోయి ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారు. తెంబూరు నుంచి ఎస్.జె.పురం, బడ్డుమర్రి రాజన్నపేట, కొత్తూరు గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే ఆ రోడ్డులో నరకానికి వెళ్లేటట్టు ఉందని వాపోతునానరు. గర్భిణులు ఈ రహదారిమీదుగా ఆస్పత్రికి వెళ్లాలంటే పరిస్థితి ఊహకందనిది. గత ప్రభుత్వ హయాంలో కల్వర్టులు నిర్మించి రోడ్లు వేయకుండా విడిచి పెట్టారు. కూటమి ప్రభుత్వంలోనైనా నాయకులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

## పట్టణ వాసులకు గేదెల బెడద

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలోని డాబాల వారి వీధిలో గేదెల బెడద వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఇదే రహదారిపై 14, 15, 17 తదితర వార్డు ప్రజలు మార్కెట్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. డాబాలవారి వీధి ప్రధాన రహదారిపై నిర్వాహకులు నిత్యం గేదెలను నిలుపుదల చేసి నరకం చూపిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని పలువురు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన, దుర్గంధం మాట అటు ఉంచితే అటు వైపుగా వెళ్లే వారిపై గేదెలు విరుచుకుపడుతున్నాయని పలువురు చెబుతున్నారు.

### చోద్యం చూస్తున్న పురపాలక సంఘ అధికారులు

డాబాలవారి వీధిలో గేదెలు, ఆవుల వలన పలుమార్లు గాయపడిన సంఘటనలపై పురపాలక సంఘ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని పలువురు వాపోతున్నారు. గతంలో గేదెలు, ఆవుల నిర్వాహకులను పిలిచి మందలించి పురపాలక సంఘ అధికారులు విడిచి పెట్టేసారని పలువురు గుర్తు చేస్తున్నారు. గేదెలకు భయపడి ఈ రహదారి గుండా ప్రయాణించడం మానేశామని పలువురు చెబుతుండడం విశేషం. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటో వారికే ఎరుకని పలువురు చెబుతుండడం విశేషం. ఇప్పటికైనా పురపాలక సంఘ అధికారులు రహదారిపై ప్రజలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారిపై ఉన్న గేదెలు